

గోల్నాక అశోక్‌నగర్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

గోల్నాక, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. బుధవారం గోల్నాక డివిజన్ అశోక్‌నగర్‌లో ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలతతో కలిసి ఆయన పర్యటించారు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం, మట్టికుప్పలను పారిశుధ్య కార్మికులతో తొలగింపజేశారు. ప్రజావాహినిలో వస్తున్న ఫిర్యాదుల మేరకు బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తూ పారిశుధ్య తీరును పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకంపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

అంబర్‌పేట నియోజకవర్గంలో గృహజ్యోతి పథకం అమలు తీరుపై విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గోల్నాక తులసినగర్ కాలనీలో క్యాంపు కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. అర్హులైన వారందరికీ న్యాయం జరిగేలా చూడాలన్నారు. నియోజకవర్గంలో గృహజ్యోతి పథకం ద్వారా 30 వేల మంది లబ్ధిపొందుతున్నారని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. సమావేశంలో డీఈఈ కమల్‌కుమార్, ఏడీ శ్రీనివాస్, ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో నిరుద్యోగుల నిరసన

చిక్కడపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థలో నిరుద్యోగులు బుధవారం రాత్రి నిరసన తెలిపారు. గ్రూప్ 2 గ్రూప్ 3 పోస్టుల సంఖ్య పెంచి డిసెంబర్‌కు వాయిదా వేయాలని నిరుద్యోగి సలీమ్ డిమాండ్ చేశారు. డీఎస్సీ పోస్టుల సంఖ్య పెంచి పరీక్షకు రెండునెలల గడువు ఇవ్వాలన్నారు. గ్రూప్ 1లో 1:100 వెంటనే ప్రకటించాలని, డిమాండ్లను నెరవేర్చాలన్నారు. నిరుద్యోగులు గిరి, నాగేష్, శ్రీను, మధు, నరేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న

ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

రాంనగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని తెలుగు యువత సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు మేడిపల్లి శ్యాంసుందర్ డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలని కోరారు. బుధవారం జిల్లా విద్యా శాఖాధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిరణ్, భానుప్రకాష్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలని 7న దీక్ష

రాంనగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన ఇందిరాపార్కు వద్ద వంగపల్లి శ్రీనివాస్ దీక్ష చేయనున్నారు. దీక్షకు సంబంధించిన కరపత్రాన్ని బుధవారం మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వరిగడ్డి చందు విద్యానగర్‌లోని సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం జాప్యం చేయడాన్ని నిరసిస్తూ వంగపల్లి శ్రీనివాస్ దీక్ష చేస్తున్నట్లు తెలిపారు. దీక్షను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వరలక్ష్మి, మహేష్, తరుణ్‌కుమార్, శ్యామ్, దయాకర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి

స్వచ్ఛంద సంస్థలు చేయూతనందించాలి

బర్కత్‌పుర, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు చేయూతనందించాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి కోరారు. బుధవారం మోతీమార్కెట్‌లోగల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి దేశాయ్, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షులు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు సుభాష్ పటేల్, కె. మురళీమోహన్‌రావు. శైలేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ సీఐ లెనిన్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

అంబర్‌పేటలో ట్రాఫిక్‌ను నియంత్రించాలి : బీజేపీ

అంబర్‌పేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట సీపీఎల్ రోడ్డు నుంచి పటేల్‌నగర్‌కు వెళ్లే దారిలో ట్రాఫిక్‌ను నియంత్రించాలని బీజేపీ నేతలు కోరారు. బుధవారం ట్రాఫిక్ సీఐ లెనిన్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రేమ్ నగర్ గ్రీన్‌ల్యాండ్ హోటల్ వద్ద వాహనాల అక్రమ పార్కింగ్‌తో అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు నో పార్కింగ్ జోన్ ఏర్పాటు చేయాలని కోరారు. సీఐని కలిసిన వారిలో బీజేపీ నేతలు ఆనంద్ గౌడ్, దాసోజు నాగభూషణచారి, యశ్వంత్, మైలారం రాజు, వెంకటస్వామిగౌడ్, భిక్షపతి, దయాకర్ యాదవ్ ఉన్నారు.

బాలికకు న్యాయం చేయాలి

నల్లకుంట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): లైంగిక దాడికి గురైన బాలికకు న్యాయం చేయాలని నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత కోరారు. బుధవారం అంబర్‌పేట సీఐ అశోక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐని కలిసిన వారిలో బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు అనంతలక్ష్మి, జ్యోతి, నీరజ, సునంద తదితరులు ఉన్నారు.

6న మెగా జాబ్‌మేళా

హైదరాబాద్ సిటీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో నిరుద్యోగ అభ్యర్థుల కోసం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. బోయిగూడ గుజరాతీ భవన్‌లో ఈనెల 6వ తేదీన నిర్వహించే జాబ్ మేళాలో 50కి పైగా సంస్థలు పాల్గొంటాయన్నారు. ఐటీ, నాన్ ఐటీ, బీపీఓ, ఫార్మాసంస్థల్లో 4 వేలకు పైగా ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

సికింద్రాబాద్-సుబేదార్‌గంజ్

ప్రత్యేక రైళ్లు ఆగస్టు వరకు కొనసాగింపు

హైదరాబాద్ సిటీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సికింద్రాబాద్-సుబేదార్‌గంజ్ మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను ఆగస్టు 27 వరకు కొనసాగిస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే ప్రకటించింది. ఈ ప్రత్యేక రైళ్లు (04121/04122) ప్రతీ గురువారం సికింద్రాబాద్ నుంచి, ప్రతీ శనివారం సుబేదార్‌గంజ్ నుంచి బయల్దేరతాయని అధికారులు తెలిపారు.

లక్ష్మణ్‌కు కేంద్ర మంత్రి పదవి ఇవ్వాలి



లక్ష్మణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బి. సూర్యనారాయణశర్మ

రాంనగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల నాయకుడు బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్‌కు కేంద్రంలో మంత్రి పదవి ఇవ్వాలని ప్రధాని మోదీకి బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు విజ్ఞప్తి చేశారు. లక్ష్మణ్ జన్మదినం సందర్భంగా పూస రాజు ఆధ్వర్యంలో బుధవారం ముషీరాబాద్ నియోజకవర్గంలో పలు ప్రాంతాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అశోక్‌నగర్‌లో లక్ష్మణ్ ఇంటి వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని తనయుడు రాహుల్‌తో కలిసి పూస రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేవైఎం మహంకాళి జిల్లా అధ్యక్షుడు మద్దూరి శివాజీ, నాయకులు బుజ్జి రవి తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పూస రాజు, లక్ష్మణ్ తనయుడు రాహుల్

కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం. నవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బద్రీనారాయణ, కంచి కుమార్, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్ కుమార్, ఓబీసీ మోర్చా నాయకులు సత్యనారాయణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

- రాజ్యసభ సభ్యుడు డా. కె. లక్ష్మణ్ పుట్టినరోజు సందర్భంగా భోలక్‌పూర్‌లో, బాగ్‌లింగంపల్లిలో మహిళలకు పౌష్టికాహార కిట్లను ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, కార్పొరేటర్ రవిచారి బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఓబీసీల సమస్యల పరిష్కారానికి లక్ష్మణ్ కృషి అభినందనీయం

ఓబీసీల సమస్యల పరిష్కారానికి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ చేస్తున్న కృషి అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బి. సూర్యనారాయణశర్మ అన్నారు. లక్ష్మణ్‌ను బుధవారం కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాయికృష్ణయాదవ్, సుబ్రహ్మణ్యంబాబు, శేషసాయి, వెంకట్రామ్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణులు సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

కవాడిగూడ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నిరుపేద విద్యార్థుల కోసం బీజేపీ నాయకులు, కార్యకర్తలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని రాజ్యసభ సభ్యుడు డా. లక్ష్మణ్ తనయుడు రాహుల్, కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ సూచించారు. బుధవారం లక్ష్మణ్ పుట్టినరోజు సందర్భంగా బీజేపీ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎంసీ మహేందర్‌బాబు ఆధ్వర్యంలో గగన్‌మహల్‌లోని పంకజ్ మెమోరియల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిరుపేద విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్ టి రవీందర్, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఎం. రమేష్‌రాం, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శులు ఎ. ప్రభాకర్ గంగపుత్ర, అగర్వాల్ సమాజ్ దోమలగూడ అధ్యక్షుడు ప్రదీప్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. లక్ష్మణ్ జన్మదినం సందర్భంగా దోమలగూడ హనుమాన్ దేవాలయంలో ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో అర్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో పిల్లల తల్లులకు బేబీ హెల్తీ కిట్‌లు అందజేశారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేసిన లక్ష్మణ్ తనయుడు రాహుల్, కార్పొరేటర్ జి. రచనశ్రీ, మహేందర్‌బాబు

లక్ష్మణ్ నాయకత్వం ఆదర్శనీయం

చిక్కడపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం చిక్కడపల్లిలో గర్భిణులు, మహిళలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. లక్ష్మణ్ నాయకత్వం బీజేపీ శ్రేణులకు ఆదర్శనీయమని కార్పొరేటర్ ఎ. పావని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, శ్రీకాంత్, ఆకుల సురేందర్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

ముషీరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్ అన్నారు. రాజ్యసభ సభ్యుడు డా. కె. లక్ష్మణ్ పుట్టిన రోజు సందర్భంగా రాంనగర్ వైఎస్‌ఆర్ పార్కు వీధిలో మహిళలకు పౌష్టికాహార కిట్లు, రెయిన్ బో హోం అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం మహంకాళి ఆలయంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎం. వరలక్ష్మి నర్సింగ్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేవైఎం నగర కార్యదర్శి కుషాల్‌గౌడ్, బీజేపీ నాయకురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

బర్కత్‌పుర, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. మాదకద్రవ్యాలను తీసుకుంటే కలిగే నష్టాలను వివరిస్తూ డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం-సమాజాన్ని మేలుకొలుపుదాం అన్న నినాదంతో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్‌ను హిమాయత్‌నగర్ ఎడ్యుకేషన్ జోన్ డిప్యూటీ డీఈఓ విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ ఏఎంహెచ్ఓ డాక్టర్ హేమలత, ప్రభుత్వ జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి ఎన్. మారన్న, ఎస్ఐ ఓ. సుమన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వసంత, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న డిప్యూటీ డీఈఓ కె.విజయలక్ష్మి, ఏఎంహెచ్ఓ హేమలత తదితరులు

బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తిపై పోక్సో కేసు

అంబర్‌పేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తిపై అంబర్‌పేట పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అంబర్‌పేటలో 14 ఏళ్ల బాలికపై డేవిడ్ అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడుతున్నాడు. ఈ విషయం స్థానికులకు తెలియడంతో వారు అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ల్యాప్‌టాప్, ఫోన్లు చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అశోక్

అంబర్‌పేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇంట్లోకి చొరబడి మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్ చోరీ చేసిన వ్యక్తిని అంబర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో సీఐ అశోక్ వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కర్నూలు జిల్లా, కల్లూరుకు చెందిన షేక్ సలీం అలియాస్ బాషా(30) సెంట్రింగ్ పనిచేస్తాడు. బాగ్‌అంబర్‌పేటలో కర్రీ పాయింట్ నిర్వహించే మహిళతో వ్యాపార భాగస్వామి. ఆమెతో సన్నిహితంగా ఉంటున్నాడు. మహిళ కుమారుడు చప్పిడి రాకేష్ తన తల్లితో మాట్లాడే ఫోటోలను ల్యాప్‌టాప్‌లో పెట్టాడు. ల్యాప్‌టాప్, ఫోన్‌లను దొంగిలించాలని సలీం నిర్ణయించుకున్నాడు. తన స్నేహితులు కర్నూలుకు చెందిన షేక్ పాలం బాషా, రాజు, నవీన్, ఉదయ్‌తో కలిసి కుట్రపన్నాడు. గత నెల 29వ తేదీన అంబర్‌పేట పోచమ్మబస్తీలో నివాసం ఉంటున్న రాకేష్ ఇంటి వద్దకు తన స్నేహితులతో కలిసి వెళ్లాడు. సలీం బయట ఉండి స్నేహితులను రాకేష్ ఇంట్లోకి పంపించాడు. వారు అతడిపై దాడిచేసి ల్యాప్‌టాప్, మూడు సెల్‌ఫోన్లను లాక్కొని తలుపులకు బయట గొళ్లెం పెట్టి పారిపోయారు. బాధితుడు రాకేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా ఈనెల 3వ తేదీ ఉదయం శ్రీమరణ చౌరస్తాలో కారులో వెళ్తున్న సలీంను పట్టుకున్నారు. అతడికి సహకరించిన నలుగురు పరారీలో ఉన్నారని సీఐ అశోక్ తెలిపారు.

అప్పులు తీర్చలేక భార్యాభర్తల అదృశ్యం

కవాడిగూడ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తలు కనిపించకుండా పోయారు. జీరా పెట్రోల్‌బంక్ లేన్‌లో నివసిస్తున్న గుజరాత్‌కు చెందిన అశితోష్‌కన్నా(38) భార్య సేజన్(38)తో కలిసి గచ్చిబౌలిలో రాజశ్రీ ఫుడ్స్ సమీపంలో చాట్‌బండార్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో చేసిన అప్పులు తీర్చలేక గతనెల 30వ తేదీ సాయంత్రం కనిపించకుండాపోయారు. కుటుంబసభ్యులు గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థిని..

ఇంజనీరింగ్ విద్యార్థిని అదృశ్యమైంది. నల్లకుంట స్ట్రీట్ నంబర్ 7లో గోదావరి అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న సీహెచ్ రమేష్, శారద దంపతుల కుమార్తె శ్రీహిత(21) ఇంజనీరింగ్ చదువుతోంది. తల్లిదండ్రులతో కలిసి బుధవారం 11 గంటలకు బోలక్‌పూర్ మేకలమండి సమీపంలో గల మల్లస్వామి ఆలయానికి వెళ్లారు. శ్రీహిత తల్లిదండ్రులతో కలిసి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తూ కనిపించకుండాపోయింది. ఆమె తండ్రి రమేష్ గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సుంకరి ఆనంద్‌కు ఉగాది కీర్తిరత్న పురస్కారం

రాంనగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అనాథలైన మానసిక దివ్యాంగులకు సుంకరి ఆనంద్ చేస్తున్న సేవలను తెలుగు అసోసియేషన్ ఆఫ్ మలేషియా(టీఏఎం) అధ్యక్షుడు డాక్టర్ వెంకట ప్రతాప్ ప్రశంసించారు. ఫెడరేషన్ ఆఫ్ ఎన్ఆర్ఐ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మలేషియా ఉగాది కీర్తిరత్న పురస్కారాలు- 2024 ప్రదానం మలేషియాలోని తెలుగు అకాడమీ ప్రాంగణంలో జరిగింది. సుంకరి ఆనంద్‌కు ఉగాది కీర్తిరత్న పురస్కారం ప్రదానం చేశారు.

అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాంనగర్ డివిజన్

మహిళా విభాగం అధ్యక్షురాలిగా కల్వ సితార

అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాంనగర్ డివిజన్ మహిళా విభాగం అధ్యక్షురాలుగా కల్వ సితార నియమితులయ్యారు. బుధవారం రాంనగర్‌లో జరిగిన వైశ్య ఫెడరేషన్ సమావేశంలో ఫెడరేషన్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ఫెడరేషన్ సలహాబోర్డు చైర్మన్ గంజి రాజమౌళిగుప్తా ఆమెకు నియామకపత్రం అందజేశారు.



మాట్లాడుతున్న గంగు ఉపేంద్రశర్మ

రూ. 1000 కోట్ల బకాయిలు వసూలు చేయాలి

రాంనగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సీఎంలు ఈ నెల 6వ తేదీన భేటీ అవుతున్న నేపథ్యంలో ఉభయ రాష్ట్రాల విభజన చట్టంలో ప్రతిపాదించిన విధంగా ఏపీ నుంచి తెలంగాణ దేవాదాయ శాఖకు రావాల్సిన బకాయిలు రూ. 1000 కోట్లు వసూలు చేయాలని తెలంగాణ అర్చక, ఉద్యోగ జేఏసీ రాష్ట్ర నేతలు డిమాండ్ చేశారు. బుధవారం అడిక్‌మెట్‌లో ఆంజనేయస్వామి దేవాలయంలో కొండూరి కృష్ణమాచారి అధ్యక్షతన జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ధార్మిక పరిషత్ ఏర్పాటు చేయాలని, పదవీ విరమణ చేసిన ప్రతి అర్చకుడికి రూ. 10 లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలని, పదేళ్ల సర్వీసు పూర్తి చేసిన అర్చకుడికి, ఉద్యోగికి రూ. 25 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రతిపాదించిన 190 ఈవో పోస్టులను భర్తీ చేసి దేవాదాయ భూములను అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. సమావేశంలో కన్వీనర్ పరాశర్మ, కోశాధికారి కొడకండ్ల శ్రీధరాచార్యులు, నాగరాజు శర్మ, గ్రేటర్ అధ్యకుడు బండారి జగపతి తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీలతో క్రీడాకారులు

చెస్ చాంపియన్ శ్రీరామ్

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి, క్రీడాప్రతినిధి): తెలంగాణ అండర్-17 చెస్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను హైదరాబాద్‌కు చెందిన యు.శ్రీరామ్ ఆదర్శ్ కైవసం చేసుకున్నాడు. దాదాపు 150 మందికి పైగా ప్లేయర్లు పాల్గొన్న ఈ పోటీలు ఎల్బీ స్టేడియంలోని యోగా హాల్‌లో జరిగాయి. శ్రీరామ్ 6.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా, విఘ్నేష్ 6 పాయింట్లతో రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకున్నాడు. బాలికల విభాగంలో బేబీ శివాంశిక టైటిల్ సొంతం చేసుకోగా, గీతిక రన్నరప్‌గా నిలిచింది. రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ విజేతలకు ట్రోఫీలు బహూకరించారు.

గంజాయి తాగుతున్న ముగ్గురు వ్యక్తుల అరెస్టు

బంజారాహిల్స్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గంజాయి తాగుతున్న ముగ్గురు వ్యక్తులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ కేబీఆర్ పార్కు గేట్ నం.9 వద్ద నిత్యం గంజాయి తాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి కేబీఆర్ పార్కు వద్ద అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. వీరు పార్కు సమీపంలో పూలు అమ్ముతూ గంజాయి సేవిస్తున్నట్లు తేలింది. దీంతో నిందితులు శివకుమార్, వినయ్‌కుమార్, అల్లం సాయిని అరెస్టు చేశారు.

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో

భారీగా ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

హైదరాబాద్ సిటీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. పలువురు పోలీసు అధికారులు ఏసీబీకి పట్టుబడడం, మరికొందరిపై అవినీతి ఆరోపణలు రావడంతో ప్రక్షాళన చేసే దిశగా పోలీస్ బాస్ దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా భారీగా బదిలీలు చేస్తూ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కె.చంద్రశేఖర్	ఎస్‌బీ(స్పెషల్ బ్రాంచి)	ఎస్‌హెచ్‌ఓ కాచిగూడ
పి.లక్ష్మీకాంత్‌రెడ్డి	ఎస్‌హెచ్‌ఓ కాచిగూడ	మల్టీజోన్-2
ఎ.ఆంజనేయులు	ఎస్‌హెచ్‌ఓ తుకారాంగేట్	సీసీఎస్ డీడీ
జి.నాగరాజు	ఐటీసెల్	ఎస్‌హెచ్‌ఓ తిరుమలగిరి
సుంకరి విజయ్	ఎస్‌హెచ్‌ఓ తిరుమలగిరి	సరెండర్
డి.మధుసూదన్‌రెడ్డి	ఎస్‌హెచ్‌ఓ మధురానగర్	వెస్ట్‌జోన్ పీసీఆర్
వై.అజయ్‌కుమార్	మల్టీజోన్-2	ఎస్‌హెచ్‌ఓ మధురానగర్
టి.కొమరయ్య	డీటీసీ, నల్గొండ	ఎస్‌బీ
ఎస్.సుధీర్‌కుమార్	వెస్ట్‌జోన్ పీసీఆర్	సరెండర్
చుక్కపల్లి పరుశురాం	ఎస్‌బీ	ఎస్‌హెచ్‌ఓ మాసబ్‌ట్యాంక్
జి.గౌరీదేవి	ఎస్‌హెచ్‌ఓ మాసబ్‌ట్యాంక్	సరెండర్
మహ్మద్ ఆసిఫ్	డీఐ టప్పాచబుత్ర	ఎస్‌హెచ్‌ఓ కాలపత్తర్
రౌతు గోపీ	ఎస్‌హెచ్‌ఓ నాంపల్లి	డీఐ టప్పాచబుత్ర
కె.మహేశ్	ఎస్‌హెచ్‌ఓ గోషామహల్(ట్రాఫిక్)	సరెండర్
టి.అశోక్‌కుమార్	సీసీఎస్ మహబూబ్‌నగర్	ఎస్‌హెచ్‌ఓ మలక్‌పేట్(ట్రాఫిక్)
జి.సైదులు	మల్టీజోన్-2	డీఐ చాదర్‌ఘాట్
ఎస్.సైదులు	ఎస్‌హెచ్‌ఓ చాదర్‌ఘాట్	మల్టీజోన్-2
ఎం.రాజు	మల్టీజోన్-2	ఎస్‌హెచ్‌ఓ చాదర్‌ఘాట్
పి.సురేశ్	ట్రాఫిక్ అడ్మిన్	మల్టీజోన్-2
బి.నర్సయ్య	ట్రాఫిక్ అడ్మిన్	మల్టీజోన్-2
ఇ.వెంకటరెడ్డి	ఎస్‌హెచ్‌ఓ ఉప్పల్(ట్రాఫిక్)	ట్రాఫిక్ అడ్మిన్
యు.శ్రీనివాసులురెడ్డి	మల్టీజోన్-2	ట్రాఫిక్ అడ్మిన్
పి.మహేందర్	మల్టీజోన్-2	డీఐ మంగళ్‌హాట్
బి.రవికిరణ్	మల్టీజోన్-2	సీసీఎస్ డీడీ
ఎం.శంకర్	టీజీ సీఅండ్‌సీసీ	ఎస్‌హెచ్‌ఓ, తుకారాంగేట్
ఎం.అప్పలనాయుడు	మల్టీజోన్-2	ఎస్‌హెచ్‌ఓ, నాంపల్లి
ఎంఎన్ ఆనంద్‌కుమార్	ట్రాఫిక్ పీఎస్ నల్లగొండ	డీఐ, సైదాబాద్
కె.కొండలరెడ్డి	డీఐ సైదాబాద్	మల్టీజోన్-2
వై.రామలింగారెడ్డి	డీఐ ఖైరతాబాద్	మల్టీజోన్-2
బి.శంకర్	సీసీఎస్ డీడీ	మల్టీజోన్-2
ఎస్.రాఘవేంద్ర	ఎస్‌బీ	టాస్క్‌ఫోర్స్ సౌత్‌జోన్
జాకీర్ హుస్సేన్	టాస్క్‌ఫోర్స్ సౌత్‌జోన్	మల్టీజోన్-2
కెఎన్ ప్రసాద్‌వర్మ	పీసీఆర్ సౌత్‌జోన్	టాస్క్‌ఫోర్స్ ఈస్ట్‌జోన్
డి.వెంకట్ రెడ్డి	టాస్క్‌ఫోర్స్ ఈస్ట్‌జోన్	ఎస్‌బీ
కె.సైదులు	సైబర్ క్రైమ్స్	టాస్క్‌ఫోర్స్ నార్త్‌జోన్
ఎం.రామకృష్ణారెడ్డి	సీసీఎస్ డీడీ	మల్టీజోన్-2
సీతారాములు	మల్టీజోన్-2	సీసీఎస్ డీడీ

నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో

జాతీయ నృత్య, సంగీత పోటీలు

చిక్కడపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో 49వ అఖిల భారత నృత్య, సంగీత పోటీలు సెప్టెంబర్‌లో నిర్వహిస్తున్నామని సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, సమన్వయకర్త నిష్ఠల సుధామాల తెలిపారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు 9908625949. 8919792216 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. బుధవారం చిక్కడపల్లిలోని సంస్థ కార్యాలయంలో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి. వసుంధర సమితి నిర్వాహక సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు.

బాటిల్ స్పోర్ట్స్ డ్యాన్స్ కార్యదర్శిగా లక్ష్మీప్రసన్న



బర్కత్‌పుర, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బాటిల్ స్పోర్ట్స్ డ్యాన్స్ కార్యదర్శిగా పంతంగి లక్ష్మీప్రసన్న నియమితులయ్యారు. బుధవారం జరిగిన సమావేశంలో బాటిల్ స్పోర్ట్స్ డ్యాన్స్ ఇండియా జాతీయ అధ్యక్షుడు నిఖిల్ తాంబే ఆమెను కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ.. రాష్ట్రంలో బాటిల్ స్పోర్ట్స్ డ్యాన్స్ క్రీడలను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

మానవీయ కోణంలో ఇనాక్ రచనలు

చిక్కడపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇనాక్ రచనలు మానవీయకోణాన్ని ప్రస్ఫుటింపచేస్తాయని ప్రముఖ సాహితీవేత్త ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. వేంకటేశ్వర యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ రచించిన భిన్న సాహితీ ప్రక్రియలపై వారం రోజులపాటు జరిగే సాహితీ సమాలోచన సప్తాహం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇనాక్ కవిత్వంపై నరసింహారెడ్డి ప్రసంగించారు. తెలుగు జాతికి వరం, అక్షరస్వరం ఇనాక్ అని, ఆయన బహుగ్రంథకర్త అన్నారు. తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా, ఉస్మానియావర్సిటీ ఆంధ్రాచార్యులు సూర్యధనుంజయ, చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు సౌందరరాజన్, చంద్రశేఖర్ ఇనాక్ సాహితీ ప్రతిభను ప్రశంసించారు. త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏనుగునరసింహారెడ్డి